# ఆలిన్ ఒన్

తెలుగు చిత్రరంగంలోని కొద్దిపాటి అగ్రగణ్యులయిన దర్శకులలో వీరేశ్వర్ ఒకరు హైదరాబాద్‌లోని ఇండస్ట్రియలిస్టు గరుడేశ్వర్ తాలూకా లోని మనిషి ఆయన్ని కలిసి, గరుడేశ్వర్ కొత్తగా చిత్రనిర్మాణంలోకి ప్రవేశించాలనుకుంటున్నారని, ఓసారి హైదరాబాద్ వెళ్ళి ఆయన్ని కలవమని కోరాడు రిటర్న్ ఎయిర్ టికెట్ కూడా ఇచ్చాడు.

రెండురోజుల తర్వాత వీరేశ్వర్ హైదరాబాదు చేరుకున్నాడు. గరుడేశ్వర్ కొత్తగా తీసుకున్న సినిమా ఆఫీసులో ఆయన్ని ఉదయం పదకొండు పదికి కలిసాడు

రకరకల వ్యాపారాలతో నిత్యం సతమతమయ్యే గరుడేశ్వర్ కరచాలనాలు, పరిచయాలు అయాక టైం వృధాచేయకుండా అసలు విషయానికి వచ్చేశారు

"మేం కూడా కొన్ని సినిమాలు తీయాలనుకుంటున్నాం, మొదటి చిత్రానికి మీరు దర్శకులనుకుంటున్నాం. వచ్చేనెలలో షూటింగు మొదలెట్టి, సరిగ్గా మూడునెలలలోగా సినిమాని రిలీజ్ చేయాలనుకుంటున్నాం. మా స్టోరీ డిపార్టుమెంట్ నాలుగుకథలు ఎన్నిక చేసింది. ఆ నాలుగు కథలు మీకు తెలుసు. దాంట్లో ఏది మీకు నచ్చింది"

"చూపులు కలిసిన శుభవేళ కథ నాకు బావుంది. బడ్జెట్‌లో తీసేయవచ్చు దాన్ని" చెప్పాడు వీరేశ్వర్.

"గుడ్ నాకు కొన్ని స్పష్టమయిన అభిప్రాయాలున్నాయి. కొన్ని సన్నివేశాలు నేను ముఖ్యం అనుకునేవి ఆ కథలో లేవు. మీరు వాటిని చొప్పించితీరాలి"

"నిజమే! నేను అలాగే ఫీల్ అయ్యేను. క్లయిమాక్సులో ఫయిటింగు, రేప్‌సీన్స్, రెండు డ్యూయెట్స్‌కి ఆ కథలో సానం లేదు, వాటిని ఎలా...."

"అవి కాదు ముఖ్య సన్నివేశాలు హీరో హీరోయిన్‌లు మొట్ట మొదట కలుసుకునేది "షెన్‌బేగ్ అనే సినిమా థియేటర్ ముందు అందులో "పేదలగొప్పలు" అనే సినిమా ఆడుతూంటుంది" చెప్పాడు గరుడేశ్వర్.

"అలాగే కానిద్దాం" చెప్పాడు దర్శకుడు వీరేశ్వర్.

"ఎక్కడోక చోట హీరోయిన్ లేదా హీరో "కీర్తి టాక్సీసర్వీస్‌కి ఫోన్ చేసి టాక్సీ తెప్పించుకోవాలి"

"అదేం పెద్ద ఇబ్బంది కాదు"

"హీరోయిన్‌కి వారపత్రిక "అరుణిమ" అంటే ఇష్టం, తరచు ఆ వారపత్రిక ఆమె చేతిలో వుంటుంది"

"ష్యూర్"

"సినిమాలో ఎక్కడో ఓ చోట పార్టీ జరుగుతుంది. అది కార్తీక్ హోటల్లోని కాన్ఫరెన్స్ హాలులో జరుగుతుంది. ఆ పార్టీకి వచ్చిన గెస్టు లందరికీ "బిమ్లీ" అంటే ఇష్టం అది తెప్పించాలి."

"బిమ్లీ ఐస్ క్రీమా!"

"యస్! కుదరదా"

"కుదురుతుంది."

"ఎక్కడో ఓచోట హీరో, హీరోయిన్ రోడ్డు మీద నడిచే సీన్ వుండాలి. అది సికింద్రాబాదులోని సర్దార్ పటేల్ రోడ్‌లో నే చెప్పిన చోట తియ్యాలి."

"పెట్టేద్దాం అలాంటి సీను"

"ఇవన్నీ వర్కవుట్ చేసి రేపు కథ వినిపించండి."

"అలాగే"

ఆ రాత్రి దర్శకుడు వీరేశ్వర్ నిర్మాత చెప్పిన మార్పులన్నీ చేసేసాడు. ఎంత ఆలోచించినా నిర్మాత అలాంటి సన్నివేశాలు ఎందుకు అడిగాడో వీరేశ్వర్‌కి అంతు పట్టలేదు. వాటిలో ఏ ఒక్కటీ బాక్స్ ఆఫీసుకి సహాయం చేయదు. రకరకాల పరిశ్రమలు స్థాపించి ఎంతో తెలివైన వారుగా పేరు పడ్డ ఆయన సిల్లీగా ఆలోచించరనే నమ్మకం వీరేశ్వర్‌కుంది.

మర్నాడు నిర్మాత వచ్చేలోగా, సినిమా విభాగం ఇన్‌చార్జ్ అడిగాడు అలాంటి అంశాలు కథలో గరుడేశ్వర్ ఎందుకు కావాలని కోరాడని.

ఇన్‌చార్జి చిన్నగా నవ్వి చెప్పాడు.

"సింపుల్ హీరో హీరోయిన్ కలుసుకునే థియేటర్ షేన్‌బాగ్ గరుడేశ్వర్‌దే. అందులో నడిచే "బీదలగొప్పలు"కి ఆయన కొంత ఫైనాన్స్ చేసారు. కీర్తి టాక్సీ సర్వీస్, అరుణిమ వార పత్రిక, కార్తీక్ హోటల్, ఓమిలీ ఐస్‌క్రీం ఇవన్నీ ఆయన వ్యాపారాలే కాబట్టి వాటికి పబ్లిసిటీ వస్తుందని ఆయన అభిప్రాయం."

"అలాగా. మరి సర్దార్ పటేల్ రోడ్ ఆయనది కాదు కదా" ప్రశ్నించాడు వీరేశ్వర్.

"కాదు. కాని ఆయనకి టెక్స్‌టైల్ మిల్స్‌వున్నాయి. ఆ మిల్స్ తయారుచేసే బట్టలు ధరించిన అమ్మాయిల బొమ్మలున్న ప్రకటన బోర్డు ఒకటి అక్కడ వుంది. సినిమాలో ఆ బోర్డు కూడా రావాలని ఆయన వుద్దేశం."

"అర్థమైంది" చెప్పాడు వీరేశ్వర్ నీరసంగా.